క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చందంపేట : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పోలేపల్లి, చందంపేటలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనుమతులు ఉన్న విత్తనాలనే విక్రయించాలన్నారు. కొనుగోలుపై రశీదు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

సత్తయ్య మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి చెందిన ముశిని(ఆప్కో) సత్తయ్య మృతి తీరని లోటని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి గురువారం ఆయన మృతదేహంపై పూల మాల ఉంచి నివాళులర్పించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, శిరందాసు కృష్ణయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్, సైదులు, జయప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

హాలియా : వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 11వ వార్డు రామచంద్రనగర్‌లో హాలియా పబ్లిక్ స్కూల్ ఎదురుగా బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వేపచెట్టు, విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుకు అడ్డంగా పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ వర్ర వెంకట్‌రెడ్డి గురువారం రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వేపచెట్టు, విద్యుత్ స్తంభాన్ని తొలగించి ప్రజల సమస్యకు పరిష్కార మార్గం చూపారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో ఆఫీసు సబార్డినేటర్‌గా పని చేసిన గుండా అశోక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన సోదరుడు ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్డికాలనీలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రేపాల పురుషోత్తం రెడ్డిలు కార్మికులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెరుపల్లి సుధాకర్, చందు, రంగోజు రవీంద్రాచారి, గిరి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మిర్యాలగూడ : మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన షేక్ సైదాసాబ్ పేద కుటుంబం కావడంతో తన కూతురు వివాహానికి గ్రామ సర్పంచ్ పేలపోలు శ్రీలత హరిబాబు గురువారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి, సైదయ్య, సైదయ్య, జానయ్య, గోపి, పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

నల్లగొండ: పోస్ట్ మెట్రిక్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీసీ, ఈబీసీ విద్యార్థుల దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15 వరకు పొడిగించినందున పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న రెన్యూవల్, నూతన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ముగిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

కనగల్ : దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జల్లేపల్లి జయరామయ్య, సర్పంచ్‌లు అల్లుబెల్లి పూలమ్మ, చనగాని అంజమ్మరామచంద్రు, ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, బీఆర్‌ఎస్ నాయకులు అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నల్లబోతు యాదగిరి అర్చకులు నాగోజు మల్లాచారి, శ్రవణకుమారాచార్యులు, దామోదర్, మహేష్, ఫణి, శ్రీను, నాగరాజు ఆలయ సిబ్బంది జినుకుంట్ల చంద్రయ్య, లింగయ్య, లింగస్వామి, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీధులు.. మురుగు కూపాలు

- వడ్డెరగూడెంలో వేధిస్తున్న డ్రెయినేజీ సమస్య
- కిందికి నీరుపోకుండా అడ్డుకట్టలు వేస్తున్న కాలనీవాసులు
- ఎక్కడికక్కడ మురుగు నిలుస్తుండడంతో దుర్గంధం
- తరచూ ఘర్షణ పడుతున్న స్థానికులు


వడ్డెరగూడెంలోని ఓ వీధిలో నిలిచిన మురుగు


మురుగు కాల్వలో మట్టి పోయడంతో వీధిలోకి వచ్చిన మురుగు

నిడమనూరు : మండలంలోని వడ్డెరగూడెం గ్రామంలో గల వీధులు మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. తమ ఇళ్ల ముందు డ్రెయినేజీ నీరు ఆగకుండా మొదటి, మూడు వార్డు వాసులు ఎక్కడికక్కడ అడ్డుకట్టలు వేసుకున్నారు. దీంతో మురుగునీరంతా డ్రెయినేజీల నుంచి పొంగి పొర్లి వీధుల్లో పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా సమస్యను పరిష్కరించాలని కోరే వారే కరువయ్యారు.

సమస్య ఏర్పడింది ఇలా..

గ్రామంలో గల ప్రధాన వీధికి ఇరవైపులా మొదటి, మూడో వార్డులకు సంబంధించి వారి నివాస గృహాలు ఉంటాయి. వీటిలో మొదటి వార్డువాసులు ఉండే వీధిలో ఉన్న మురుగుకాల్వ చివరన ఉన్న ఇంటికి చెందిన వ్యక్తి తన ఇంటి ఎదుట నీరు నిలిచి వాసన వస్తుందని అక్కడకు డ్రెయినేజీ నీరు రాకుండా అడ్డుకట్ట చేశాడు. దీంతో డ్రెయినేజీ నీరు తమ ఇంటి ముందు నిలుస్తున్నాయని ఎవరికి వారు వీధివీధంతా ఏకంగా డ్రెయినేజీలోనే అడ్డుకట్టలు వేసుకున్నారు. ఫలితంగా డ్రెయినేజీ పొంగిపొర్లి మురుగునీరంతా వీధుల్లో పారుతూ సమస్య మరింత పెరిగింది. ఈ క్రమంలో తమ ఇంటి వద్ద నిలుస్తుందని ఒకరికొకరు గొడవలకు దిగుతున్నారు. ఇదిలా ఉంటే వీధి గుండా రాకపోకలు సాగించే వారి పరిస్థితి దారుణంగా ఉంది. ఆ వీధి గుండా ఎవరైనా నడుచుకుంటూ వెళ్తుంటే ఆ సమయంలో ద్విచక్రవాహనం వెళ్తే ఆ డ్రెయినేజీ నీళ్లు వారిపై పడుతున్నాయి. అంతేగాక డ్రెయినేజీ నీరు నిలుస్తుండడంతో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో ద్విచక్ర వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

పోలీస్‌స్టేషన్ మెట్లెక్కినా..

గ్రామంలోని మొదటి వార్డులో మురుగునీరు సాఫీగా దిగువ భాగానికి వెళ్లకుండా అడ్డుకట్టలు వేస్తున్నారని సర్పంచ్, ఇతరులు నిడమనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు వచ్చి నచ్చజెప్పినా రెండు మూడు రోజులు కట్టలు తీసి మరలా అడ్డంకులు వేస్తున్నారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించని పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కిందట నిర్మాణం చేసిన డ్రెయినేజీ కావడం వల్ల వీధి చివరి వరకూ లేకపోవడం ఒక కారణంగా చెప్పొచ్చు. మురుగునీరు పూర్తిగా వెళ్లిపోయేలా సీసీ డ్రెయినేజీ నిర్మాణం చేయడం, వీధిలో సీసీ రోడ్డు వేయడం వల్ల సమాంతరంగా మారి నీరు నిల్వ ఉండకుండా సమస్య పరిష్కారయ్యే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని వార్డువాసులు కోరుతున్నారు.

వీధి వాసులే సమస్యకు కారణం



సమస్యకు కారణం ఆ వీధివాసులే పంచాయతీలో నిధులు లేకున్నా ఈజీఎస్‌లో పెట్టి మురుగు కాల్వను శుభ్రం చేయించాను. అది ముణ్నాళ్ల ముచ్చటగానే మారింది. ఎవరి ఇంటి ఎదుట వారు కట్టలు వేసుకోవడం వల్ల మురుగునీరు సాఫీగా ముందుకు వెళ్లకుండా సమస్య ఏర్పడుతోంది. పోలీసులు వచ్చి ఎన్నో సార్లు చెప్పినా వినడం లేదు. పోలీసులు చెప్పినా రెండు రోజులు వింటున్నారు. మళ్లీ అడ్డుకట్టలు వేస్తున్నారు.

- మహేష్, సర్పంచ్, వడ్డెరగూడెం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు


మిర్యాలగూడ : అలగడపలో రైతువేదిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం రూ.22లక్షల చొప్పున నిర్మించిన మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామంలో గల రైతువేదికను, దామరచర్ల మండలం వీర్లపాలెంలోగల రైతువేదికను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ నాగమణి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సైదులు, దామరచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని చిరుమర్తి గ్రామంలో రైతు వేదికను గురువారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. అంతకుముందు బొమ్మకల్లు గ్రా మంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతి ష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశా రు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవిద్య రాజు, జెడ్పీ కో ఆప్ష న్ సభ్యుడు మోసిన్ అలీ, సర్పంచ్ నాంపల్లి శ్రీశైలం, ఉప సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కళింగరెడ్డి, బాబయ్య, ఏడీఏ నాగమణి, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, ఏఓ సైదా నాయక్, పంచాయతీరాజ్ ఏఈ నరేష్, ఎస్ఐ నరేష్‌కుమార్, ఏఈఓ లావణ్య ఉన్నారు.

వేములపల్లి : రాష్ట్రంలోని రైతులను రాజుగా చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రావులపెంట గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన రైతువేదికను ఎంపీపీ పుట్టల సునీత, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20లక్షలతో పల్లె వైద్య శాల భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, మల్ల య్యయాదవ్, ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుధర్‌రెడ్డి, కృపాకర్‌రావు, ఎంపీడీఓ దేవిక పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు వేదికలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మొల్కచర్ల గ్రామంలో రూ.22 లక్షల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ క్షుద్ర సేవ్యానాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏ పొరెడ్డి నాగమణి, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ కాంతి, వ్యవసాయ ఏఓ అర్చన, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సూర్యానాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను ఏఈఓలు రావుల నరేష్ ఉన్నారు.

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి


దేవరకొండ : ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం దేవరకొండ మున్సిపాలిటి పరిధిలోని 15వ వార్డులో రూ.12.50లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని వార్డుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఓపెన్ జిమ్‌లు, మినీ పార్కులతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాహత్‌అలీ, కౌన్సిలర్లు మహమ్మద్ రయూస్, జయప్రకాశ్, నాయకులు సైదులు, తౌఫిక్, వేముల రాజు, ప్రదీప్, అశోక్, ఇలియాస్ పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

డిండి : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన, కార్యక్రమానికి ఆయనను ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నాడు. దేవాలయాలాభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగార్జున్‌రెడ్డి, సర్పంచ్ రవీందర్‌రావు, పేర్వాల జంగారెడ్డి, దొంతినేని భగవంతరావు, గొడుగు వెంకటయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి


హాలియా : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్


నల్లగొండలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, డీఏఓ సుచరిత

హాలియా : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ పిలుపునిచ్చారు. గురువారం హాలియా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నియోజకవర్గ స్థాయి అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. జూన్ 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను పండుగలా జరపాలని సూచించారు. అందుకు సంబంధించి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ విరిగినేని అంజయ్య, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఎంపీపీలు జయమ్మ, వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, స్పెషల్ ఆఫీసర్, పీడీ రాజ్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

చందంపేట : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని జూన్ 2 నుంచి నిర్వహించే దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని దేవరకొండ ఆర్డీఓ గోపిరాం పేర్కొన్నారు. గురువారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దేవదాసు, ఎంపీడీఓ రాములునాయక్, డిప్యూటీ తహసీల్దర్ ముక్తార్, వైద్యులు ధనలక్ష్మి, చందునాయక్, ఎంఈఓ సామ్యనాయక్, ఏపీఓ వరలక్ష్మి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని ఈనెల 4న పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ వీరబాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలతో మమేకమవుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

నల్లగొండ టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతువేదికల్లో నిర్వహించే సంబరాలకు రైతులు, రైతుబంధు సమితి సభ్యులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి క్లస్టర్ పరిధిలోని రైతువేదికలో ఆయా గ్రామాలకు చెందిన వెయ్యి మంది రైతులను సమీకరించనున్నామన్నారు. వారందరికీ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొని వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలు, ఇతర సమాచారాన్ని రైతులకు తెలియజేస్తారన్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఎద్దులను అలంకరించి ర్యాలీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోతున్నందున వరిసాగును ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. వానాకాలం వరినార్లు రోహిణి కార్తెలో పోసుకుని నవంబర్‌లో కోతలు పూర్తి చేసుకోవాలని, యాసంగి సీజన్‌కు సంబంధించి నవంబర్‌లో నార్లు పోసుకుని మార్చిలో కోతలు పూర్తి చేసుకుంటే అకాల వర్షాల నుంచి రైతులు నష్టపోయే అవకాశం ఉండదని అన్నారు. ఈ సందర్భంగా వరి పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని రూపొందించిన పోస్టర్‌ను చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఏఓ వై.సుచరిత, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ కోసం ఉద్యమించాలి


తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ కోరకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు ప్రజా సంఘాల నాయకులు వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పలు సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. అమరుల ఆకాంక్షల మేరకు నిధులు, నీళ్లు, నియామకాల్లో తెలంగాణ అభివృద్ధిని సాధించాలన్నారు. భారత రాజ్యాంగ సామాజిక న్యాయ సూత్రాలకు అనుగుణంగా పాలన కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ప్రజా సైన్ వేదిక నాయకులు ముచ్చ రామారావు, డెమోక్రటిక్ ప్రొగ్రెసివ్ వేదిక నాయకులు కస్తూరి ప్రభాకర్, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మారం శ్రీనివాస్, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు మాలోతు దశరథనాయక్, వివిధ సంఘాల నాయకులు హరి, డేగ వీటి, నారాయణరెడ్డి, హఫీజ్, సుదర్శన్, జ్వాల వెంకటేశ్వర్లు, రామయ్య, రాజు, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు కలిమెల నాగయ్య, మనోజ్, వెంకన్న పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నరేంద్ర మాదిగ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు 16 ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మారేపాక నరేంద్రమాదిగ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బహిరంగ సభకు మాదిగలు, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టీఎస్ ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొండికత్తి అశోక్ మాదిగ, తిరుమలగిరి, నిడమనూరు మండలాల అధ్యక్షుడు పోలేపల్లి లక్ష్మణ్, బొజ్జ యేసు, నాయకులు లింగాల వరప్రసాద్, పెద్దమాము మహేందర్, అనుముల పెద్ద వెంకటయ్య, రాజేందర్, సైదులు, నగేష్, సతీష్, నాగయ్య, ప్రశాంత్, కొండల్, వినోద్, మహేందర్, గోపి పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి అభినందనలు


రికార్డులను పరిశీలిస్తున్న అధికారి సుధీర్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం విజయవం చేసిన సిబ్బందికి జిల్లా కంటి వెలుగు క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ జి.సుధీర్‌కుమార్ అభినందనలు తెలిపారు. నేటితో ముగియనున్న కంటి వెలుగు ప్రోగ్రాం అనుకున్న లక్ష్యం కంటే ముందుగానే చేరుకున్నామని, 844 గ్రామ పంచాయతీల్లో , 182 వార్డుల్లో 75 టీంలతో కార్యక్రమాన్ని కొనసాగించినట్లు తెలిపారు. దాదాపు 8లక్షల 10వేల మందికి కంటిరీక్షలు నిర్వహించి లక్షా పదివేల మందికి అక్కడిక్కడే దగ్గరి చూపు అద్దాలు అందించి మరో 67వేల మందికి ఆర్డర్ ద్వారా అద్దాలు తయారు చేయించి ఇచ్చినట్లు తెలిపారు. వేసవి కాలంలోనూ ప్రజలు కంటి వెలుగు శిబిరాలను ఉపయోగించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో నిరంతరాయంగా తమ సేవలుందించిన 75టీంల వైద్యులు, అప్తామాలజీస్టులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు శిబిరం

మాడుగులపల్లి: మండలంలోని చిరుమర్తి గ్రామంలో కంటి వెలుగు శిబిరం గురువారం ముగిసింది. గత నెల 25 నుంచి వారం రోజులపాటు వైద్య సిబ్బంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1664 మంది జనాభా ఉండగా 900 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 150 మందికి రీడింగ్ గ్లాసులు, 111 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి అందించినట్లు పాములపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సంజయ్ కుమార్ తెలిపారు. శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సత్యనారాయణ, అప్తాల్మిక్ అసిస్టెంట్ జానయ్య, ఏఎన్ఎంలు వనజాత, సులోచన, సూపర్‌వైజర్ రజిని, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు విరాళాలు


కొత్తలాపురంలో అలేఖ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి

గుర్రంపోడు : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, వైష్ణవి కన్‌స్ట్రక్షన్ అధినేత బుసిరెడ్డి పాండురంగారెడ్డి బుధవారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి విరాళాలు, ఆర్థిక సహాయాలు అందించారు. కాచారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ మసీదు అభివృద్ధి పనులు నిమిత్తం రూ.1,05,000లు, శ్రీఆంజనేయ దేవాలయ నిర్మాణానికి రూ.1,05,000లు విరాళంగా అందజేశారు. కొత్తలాపురం గ్రామంలో అనాథ బాలికకు కట్టిబోయిన అలేఖ్యకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. తానేదార్‌పల్లి గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు జరిపారు. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి, మరో వికలాంగునికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గాలి సరితారవికుమార్, నాయకులు పాశం గోపాల్‌రెడ్డి, యడవల్లి దిలీప్‌రెడ్డి, రాంరెడ్డి, బల్గూరి నగేష్‌గౌడ్, గుండెబోయిన కిరణ్‌కుమార్, రావులపాటి భాస్కర్, షేక్ మస్రత్ సయ్యద్‌మియా, పగిళ్ల లాలయ్య, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, పానుగోటి నర్సింహారావు, మదార్‌షా, భవానీ సైదులు, సుభాని, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు


గుర్రంపోడు : తానేదార్‌పల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

గుర్రంపోడు : మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి కలిసిమెలిసి ఉండాలన్నారు. ఆలయ కమిటీ ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ గాలి సరితా రవికుమార్, తిరుమలగిరి ఎంపీపీ భగవాన్ నాయక్, గుర్రంపోడు సర్పంచ్ షేక్ మస్రత్ సయ్యద్‌మియా, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి , నాయకులు నగేష్ గౌడ్, కిరణ్‌కుమార్, లాలయ్య, యాదయ్య, బోజ్యానాయక్ పాల్గొన్నారు.

త్రిపురారం: గ్రామ దేవతల పండుగలను గ్రామస్తులు కలిసికట్టుగా జరుపుకోవాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాటూరు గ్రామంలోని మైసమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మండల కాంగ్రెస్ నాయకులు జానారెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ నాయక్, సైదయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని బొమ్మకల్లు గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం దేవతామూర్తుల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం ఆలయంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ దేవతామూర్తుల విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులకు, భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేములపల్లి ఎంపీపీ సునీత, సర్పంచ్ మారుతి వెంకట్ రెడ్డి, మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

పెద్దవూర : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని బట్టుగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దండెం ముత్తయ్య తన కున్న గేదెలను మేపడానికి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాలకు తోలుకుని వెళ్లాడు. మూడు రోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వాగు సమీపంలో 33/11 విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ తీగలు నేలను తాకే ఎత్తులో పడిపోయాయి. గేదెలు మేసుకుంటూ వెళ్లి తెగిపడిన విద్యుత్ తీగలను ఒకదాని తర్వాత ఒకటి తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడు అప్పు తెచ్చి రెండు గేదెలను కొనుగోలు చేసి పాడిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందడంతో బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

ఓబీసీ సెల్ నియోజకవర్గ చైర్మన్‌గా శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఓబీసీ సెల్ చైర్మన్‌గా మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన కోట శ్రీనివాస్‌రావును నియమిస్తూ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ జె.పరమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో గురువారం మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి శ్రీనివాస్‌రావుకు నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగయ్యయాదవ్, నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సలీం, చాంద్‌పాషా, లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.


నియామకపత్రం అందజేస్తున్న జానారెడ్డి